క్లుప్తంగా

నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు



నిరాశ్రయుల వసతిగృహానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: నిరాశ్రయులకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నట్టు శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ తెలిపారు. నగరంలోని అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి గ్రామ సమస్యలు



పేరాపురంలో జరుగుతున్న గ్రామసభ

పూసపాటిరేగ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జరిగిన గ్రామసభల్లో వివిధ సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంపడాంలో పెదఅప్పలనాయుడు ఇంటి నుంచి డ్రైనేజీ నిర్మించాలని, సచివాలయ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పేరాపురంలో జరిగిన సభలో గ్రామంలోని సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నీలిమ, ప్రజాప్రతినిధులు పి.కుమార్, పి.శ్రీనివాసరావు, బి.రవికుమార్, రమేష్, కె.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి రాణి

పూసపాటిరేగ: బీసీసీ టీకాలు వేయించుకుని వ్యాధుల నుంచి రక్షణ పొందాలని జిల్లా లెప్రసీ, క్షయ నివారణ అధికారి కె.రాణి అన్నారు. మండలంలోని సీహెచ్ అగ్రహారంలో గురువారం చేపట్టిన బీసీజీ టీకా కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణే ధ్యేయంగా కార్యక్రమం జరుగుతోందన్నారు. వయోజనుల్లో టీబీ తగ్గించేందుకు టీకా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి, హెల్త్ సిబ్బంది వేదమణి, మహేశ్వరి, ఆర్.వి. రమణ, నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీఓలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి నేతృత్వంలో గురువారం అన్నసమారాధన జరిపారు. మహాశివునికి ప్రీతికరమైన మాసశివరాత్రి రోజున ఏటా భక్తులకు అన్నప్రసాదం వడ్డించడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు, దాతల సహాయ, సహకారాలతో కార్యక్రమాలను నిర్విఘ్నంగా చేయగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, శోభారాణి, భీమరాజు, భరణి, సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులకు చెక్



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గంట్యాడ: దోమల నివారణతో చాలా రకం వ్యాధులకు చెక్ పెట్టవచ్చని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి పల్లవి అన్నారు. డెంగ్యూ వ్యాధి నివారణ మాసోత్సవాల్లో భాగంగా బోనంగి గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టడంతో డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని, దోమతెరలను వాడాలని సూచించారు. గ్రామాల్లో జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌ఓ రాజ్, హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి, ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి

- ఊరూరా అల్లూరి జయంతి వేడుకలు
- చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, కార్యాలయ సిబ్బంది



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్లు

విజయనగరం: విప్లవ జ్యోతిగా, పోరాట యోధునిగా, మన్యం వీరునిగా అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. అల్లూరి సీతారామరాజు 127 జయంతిని పురస్కరించుకొని కార్పొరేషన్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అల్లూరి దేశభక్తిని కొనియాడారు. కార్యక్రమంలో ఏసీపీ అమ్మాజీరావు, టీపీఆర్వో సింహాచలం పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో..

విజయనగరం రూరల్: విజయనగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పలువురు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పూసపాటిరేగ: అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణరాజు, తదితరులు



డెంకాడ: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, ఉపాధ్యాయులు

కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డి.తిరుపతినాయుడు, కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **డెంకాడ:** మండలంలోని డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెంకాడ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి ఉపాధ్యాయులతో పాటు లైబ్రేరియన్ మహేష్ పూలమాల వేసి నివాళలర్పించారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు.

ఆదర్శనీయుడు..

నెల్లిమర్ల రూరల్: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయమని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. కొండగుంపాం అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సూరి, ఆదినారాయణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులరిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో అల్లూరికి జోహార్లు చెబుతున్న నాయకులు

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయికం

పూసపాటిరేగ: అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయికమని మండల వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు అన్నారు. రాజా వీధిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాసుబాబు, హరిబాబు, అప్పన్న, కిషోర్, వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

● విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం మరవలేనిది అని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అల్లూరిసీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ప్రజాప్రతినిధిలు మహంతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లిమర్ల:** స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్య కళాశాల అధ్యాకులు, విద్యార్థులు

అల్లూరి గొప్ప దేశభక్తుడు

విజయనగరం అర్బన్: అమాయకులైన గిరిజన జాతి ప్రజలను ఒక్కతాటిపై నిలిపి, వారిని విప్లవ వీరులుగా తీర్చిదిద్ది, బ్రిటీష్ ప్రభుత్వంపై యుద్ధం చేసిన అల్లూరి సీతారామరాజు వంటివారు భారత విప్లవ చరిత్రలో మరొకరు కానరారని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని తోటపాలెంలోని సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు గొప్ప దేశభక్తుడని, ఛత్రపతి శివాజీ, రాణా ప్రతాప్‌ల కోవకు చెందిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సాయిదేవమణి, ఎన్ఎస్ఎస్ పీఓ బి.సూరపునాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఉదయ్‌కిరణ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత



మన్యం వీరుడు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ కేంద్రమంత్రి

విజయనగరం: అల్లూరి సీతారామరాజు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కొనియాడారు. అల్లూరి జయంతి వేడుకలు దాసన్నపేట రైతు బజార్ జంక్షన్‌లో అల్లూరి సీతారామరాజు సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, పాకలపాటి రఘువర్మ, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు హాజరయ్యారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెనుమత్స మాట్లాడుతూ అల్లూరి అడుగుజాడల్లో నడుచుకోవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ దేశ భక్తితో ముందుకు నడుచుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తి ప్రతి భారతీయుడి గుండెలో నిండి ఉండాలన్నారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు సేవ సమితి సభ్యులు కేఏపీ రాజు, సాగి శివాజీ రాజు, పెనుమత్స సీతారామరాజు, ఐవీపీ రాజు, చంటి, సూర్యనారాయణరాజు, జీఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

క్షత్రియ పరిషత్ విజయనగరం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. నగరంలోని అయోధ్యామైదానికి సమీపంలోని క్షత్రియ కళ్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిషత్ సభ్యులు నిత్యావసర సరుకులను పేదలకు పంపిణీ చేశారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం



వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం: క్రీడాభివృద్ధికి కృషిచేస్తానని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో మూతపడిన క్రీడా పాఠశాలతో పాటు ఖోఖో, కబడ్డీ అకాడమీలను తెరిపించడంలో సాధ్యాఅసాధ్యాలపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాజీవ్ క్రీడామైదానంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులతో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజీవ్ క్రీడా మైదానం, విజ్జి స్టేడియం, ఇండోర్ స్టేడియం, ఆక్వా స్విమ్మింగ్ పూల్‌ను క్రీడాకారులందరూ వినియోగించుకునేలా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామన్నారు. పోలీసుల సాయంతో క్రీడా ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామన్నారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన వారిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి



ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పూసపాటిరేగ: గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని చల్లవానితోట గ్రామస్తులు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవికి విన్నవించారు. గ్రామంలో సర్పంచ్ పతివాడ వరలక్ష్మి అధ్యక్షతన గురువారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కొండగుడ్డి యాతపేటలో డ్రైనేజీ సమస్య ఉందని, ముత్యాలమ్మకాలనీలో గృహాలు నిర్మించుకొని 20 ఏళ్లు దాటుతున్నా పట్టాలు మంజూరు చేయలేదని, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, రైతు భరోసా కేంద్రానికి సొంతభవనం మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు, తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపీడీఓ రాధిక, చల్లవానితోట మాజీ సర్పంచ్ పతివాడ శ్రీనివాసరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

విజయనగరం అర్బన్: జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ దృష్టికి గురువారం తీసుకెళ్లామని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మానాపురం రవిచంద్ర శేఖర్ తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ కల్పించాలని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా వినతిపత్రం ద్వారా కలెక్టర్‌కు తెలియజేశామని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు గోపాల్ వర్మ, వి.గౌరీశంకరరావు, రమణ, అరుణ్‌కుమార్, హేమంత్‌కుమార్, రమేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు ఆర్‌అండ్‌బీ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి, కొత్త రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు, రోడ్ల మరమ్మతులపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కె.విజయరత్నం, ఈఈ పి.రాధాకృష్ణ, విజయనగరం డీఈఈ టి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

- వ్యవసాయ సహాయ సంచాలకులు కోటేశ్వరరావు



కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు కోటేశ్వరరావు

నెల్లిమర్ల రూరల్: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలను అందజేస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని సీతారామునిపేట గ్రామంలో రైతులకు కౌలు గుర్తింపు కార్డుల నమోదుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కౌలు గుర్తింపు కార్డుల కాల పరిమితి 11 నెలలు ఉంటుందని, అర్హులైన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్డుల వల్ల బ్యాంకులో రుణాలు, ప్రభుత్వ రాయతీ విత్తనాలు, పంటల బీమా, నష్ట పరిహారం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు, సర్పంచ్ ప్రతినిధి రాంబార్కి రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చివరి ఎకరానికీ సాగునీరు అందిస్తాం



గుర్ల: అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల: మండలంలో చివరి ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హామీ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలోని తోటపల్లి కాలువలో పూడిక తీతల కోసం రూ.20లక్షలు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు కిరణ్‌కుమార్, చనమల్లు మహేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటరమణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేసి, బకాయిలు ఇప్పించండి

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)లో పని చేస్తున్న ఉద్యోగులకు వేతన సవరణ చేసి, రావాల్సిన బకాయిలు ఇప్పించాలని ఆ సంస్థ ఉద్యోగులు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును కోరారు. ఆర్‌ఈసీఎస్ ఎంప్లాయిస్, వర్క్‌మన్ అసోసియేషన్ ప్రతినిధులు శిరువూరు రాధాకృష్ణ, అంబల్ల సూర్యనారాయణ తదితరులు ఎమ్మెల్యేను గురువారం కలిసి వినతిప త్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2021లో ఆర్‌ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేసినట్లు చెప్పారు. ఏపీఈపీడీసీఎల్‌లో అమలవుతున్న వేతనాలు, ఇతర అలవెన్సులే తమకూ అమల్లో ఉన్నాయని వివరించారు. ఈనేపథ్యంలోనే 2023లో ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులకు జరిగిన వేతన సవరణను ఆర్‌ఈసీఎస్ ఉద్యోగులకు కూడా అమలు చేయాలని తమ సంస్థ ఎండీ తీర్మానం చేసి సమర్పించినప్పటికీ ఇంతవరకు అమలు జరగలేదన్నారు. దీంతో తమకు డీఏలు, వేతన సవరణ, ఇతర సదుపాయాలు రాలేదన్నారు. తమ సమస్యను పరిష్కరించి వేతన సవరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అవస్థల ప్రయాణం!



పూసపాటిరేగలో బస్సుకోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

- అరకొర సర్వీసులు.. ఆవేదనలో విద్యార్థులు
- ఉదయం, సాయంత్రం వేళ తప్పని ప్రయాణ కష్టాలు
- ఫుట్ బోర్డులపై ప్రమాదకర ప్రయాణం



తొక్కిసలాడుకుంటూ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

పూసపాటిరేగ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. సుఖవంతం. దీంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆ మేరకు బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యాలయాలు ఉన్న రూట్లలో అరకొర సర్వీసులతో విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. కిక్కిరిసినట్టుగా ప్రయాణించే బస్సుల్లో ఎక్కేందుకు విద్యార్థినులు భయపడుతున్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య, సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య పూసపాటిరేగ కూడలి నుంచి రణస్థలం, చింతపల్లి, తిప్పలవలస, భోగాపురం వైపు వెళ్లే బస్సులలో ప్రయాణించాలంటే హడలిపోవాల్సిందే. ఆ సమయంలో వందల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు రహదారిపై బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. బస్సుకోసం వేచిచేస్తున్న వారిలో సగం మంది ఎక్కేసరికి బస్సు కిక్కిరిసిపోతుంది. విద్యార్థులు ప్రమాదం అని తెలిసినా ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

వేల సంఖ్యలో విద్యార్థులకు అరకొర సర్వీసులు..

మండలకేంద్రం పూసపాటిరేగలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సుమారు 3 వేల పైబడి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నిత్యం ఆయా గ్రామాల నుంచి బస్సులు ద్వారానే విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో సుమారు 2 వేల మంది ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి పూసపాటిరేగ నుంచే ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పూసపాటిరేగ గుండా వెళ్లే ఆర్టీసీ సర్వీసులు పెంచి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సేవలందించాలని కోరుతున్నారు.

కిక్కిరిసిన ప్రయాణం

నిత్యం పూసపాటిరేగలో కళాశాలకు వచ్చినప్పుడు కిక్కిరిసినట్టు ఉండే బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు వేయకపోవడంతో ప్రయాణ కష్టాలు తప్పడంలేదు. ఆర్టీసీ అధికారులు కొత్త సర్వీసులు వేసి విద్యార్థుల రాకపోకలకు సహకరించాలి.

– కె.వినోద్, పైడి భీమవరం విద్యార్థి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో కొత్తవలస సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ ఎల్.విజయ గురువారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఎరువులు, విత్తనాల నిల్వలను, వాటి గడువు తేదీని పరిశీలించారు.విత్తనాల ప్యాకెట్లను తూకం వేయించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినా, నాసిరకం విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట ఏఓ స్వాతికుమారి ఉన్నారు.